

చట్టాలు కఠినంగా అమలు చేయాలి

వైద్య సిబ్బంది కోసం ప్రభుత్వాలు రక్షణ చట్టాలను కఠినంగా అమలు చేయాల్సిందే. పని ప్రదేశంలో హౌస్ సర్జన్లు, పీజీ విద్యార్థులు, డ్యూటీ డాక్టర్లకు విశ్రాంతి గదులు ఉండాలి. సీసీ కెమెరాల ఏర్పాటు తప్పనిసరి. కొన్నిచోట్ల వైద్య సిబ్బంది 36 గంటల డ్యూటీ చేస్తున్నారు. 24 గంటల కంటే డ్యూటీ చేయడం కష్టం. ప్రధానంగా మహిళా ఉద్యోగులు పనిచేసే చోట మహిళా భద్రత సిబ్బందినే నియమించాలి. అప్పుడే మనిషికి మనిషి తోడులా ఉంటుంది.

– డాక్టర్ మట్టా శ్రీ ప్రియాంక, ఆర్పీపేట యూపీహెచ్‌సీ



మహిళా వైద్యులకు భద్రత కల్పించాలి

ఆస్పత్రుల వద్ద మహిళా వైద్యులు, సిబ్బంది కోసం ప్రత్యేకంగా మరుగుదొడ్లు, దుస్తులు మార్చుకునే గదులు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. విధుల్లో ఉన్న సమయంలో భద్రత కల్పించాలి. మురికివాడల్లో యూపీహెచ్‌సీలు ఏర్పాటు చేసినా సరైన రక్షణ ఉండడం లేదు. యూపీహెచ్‌సీల వద్ద సెక్యూరిటీ వ్యవస్థ ఏర్పాటు చేయాలి. అప్పుడే మహిళా వైద్యులు, సిబ్బంది ధైర్యంగా విధులు నిర్వర్తించగలరు. ఆ దిశగా ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలి.

– శాంతి, ప్రధాన వైద్యాధికారి, భవానీ గార్డెన్స్, యూపీహెచ్‌సీ

నందనందనా..

నందనందనుడు ప్రతీ ఇంటా కొలువుదీరాడు. కృష్ణాష్టమి పర్వదినాన గృహాలు నందనవనాలయ్యాయి. ఆలయాలన్నీ బృందావనాలను తలపించాయి. శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలను సోమవారం కనులపండువగా నిర్వహించారు. బుజ్జాయిలు బాల కృష్ణులు, చిన్నారి గోపికల వేషధారణల్లో కనువిందు చేశారు. చిన్ని కృష్ణుడికి ప్రీతిపాత్రమైన పాలు, పెరుగు, వెన్నను నివేదించి, ఉట్టి సంబరాలు నిర్వహించారు.



వనదుర్గా ఆలయంలో కృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొన్న చిన్నారులు

- కొలువుదీరిన చిన్నికృష్ణులు
- కనులపండువగా కృష్ణాష్టమి
- ఆలయాల్లో ఘనంగా వేడుకలు



శ్రీహరిపురం వద్ద కృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొన్న మేయర్ హరి వెంకటకుమారి దంపతులు, కార్పొరేటర్ పి.వి.సురేష్ దంపతులు

మల్కాపురం: శ్రీ కృష్ణాష్టమి వేడుకలను పారిశ్రామిక ప్రాంతంలో కనులపండువగా జరుపుకొన్నారు. ఆయా ప్రాంతాల యాదవ సంఘాల ప్రతినిధులు ఉత్సాహంగా వేడుకలు నిర్వహించారు.

● జీవీఎంసీ 60వ వార్డు పవనపుత్ర కాలనీ వద్ద గల వేణుగోపాల స్వామి ఆలయంలో జరిగిన కృష్ణాష్టమి వేడుకలలో నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, వార్డు కార్పొరేటర్ పి.వి.సురేష్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

● గాజువాక ఆర్టీసీ డిపో వద్ద గల శ్రీకృష్ణ యాదవ కల్యాణమండపం వద్ద జరిగిన పూజల్లో విశాఖ ఎంపీ భరత్, పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు, కార్పొరేటర్ పుర్రె పూర్ణశ్రీ యాదవ్, యాదవ సంఘం ప్రతినిధి పుర్రె అప్పారావు యాదవ్ తదితరులు పాల్గొన్నారు. శ్రీకృష్ణుడిని పాలు, పెరుగుతో అభిషేకించారు.

● 58వ వార్డు పిలకవానిపాలెం వద్ద గల వనదుర్గా ఆలయంలో కృష్ణాష్టమి వేడుకలను చిన్నారులు ఘనంగా నిర్వహించారు.

● 61వ వార్డు మల్కాపురం, యాదవవీధి వద్ద గల శ్రీకృష్ణుని మందిరంలో వేడుకలు కనులపండువగా జరిగాయి. శ్రీవిజ్ఞాన మండలి యాదవ సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ పూజల్లో పలు పార్టీలకు చెందిన ప్రజా ప్రతినిధులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

● ములగాడ హౌసింగ్ కాలనీ వద్ద ప్రతిభ పబ్లిక్ స్కూల్లో నిర్వహించిన వేడుకల్లో చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణల్లో అలరించారు. ఉట్టి సంబరాన్ని ఘనంగా నిర్వహించారు. బాలికల నృత్య ప్రదర్శన అలరించింది.



ములగాడ హౌసింగ్ కాలనీ వద్ద ఉట్టి కొడుతున్న చిన్నారి



శ్రీ రామకృష్ణ పాఠశాలలో చిన్ని కృష్ణులు, గోపికలుగా చిన్నారులు

చిన్నికృష్ణుల సందడి

గోపాలపట్నం: కృష్ణాష్టమి పర్వదిన వేళ గోపాలపట్నం పరిసర ప్రాంతాల్లోని వేణుగోపాలస్వామి ఆలయాల్లో భక్తులు విశేష పూజలు చేశారు. వెంకటాపురంలోని కృష్ణాలయం, పాత గోపాలపట్నం కొత్తపాలెం, చంద్రనగర్ ప్రాంతాల్లోని పలు ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. కొత్తపాలెం ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయం చిన్నికృష్ణులతో సందడిగా మారింది. సంస్కృత భారతి ఆధ్వర్యంలో నిర్వహించిన చిన్నికృష్ణుల వేషధారణ పోటీలకు విశేష స్పందన లభించింది.

● 91, 92 వార్డుల్లోని వేణుగోపాల స్వామి ఆలయాలను వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బెహరా భాస్కరరావు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ ఆయనకు స్వామి వారి శేష వస్త్రాలు, తీర్థప్రసాదాలు అందించింది.

● ఎన్ఏడీ శాంతినగర్ శ్రీరామకృష్ణా స్కూల్‌లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. శ్రీ కృష్ణుడు, గోపికల వేషధారణలో చిన్నారులు అలరించారు. బాలల నృత్య రూపకాలు అలరించాయి. పాఠశాల డైరెక్టర్ ఎ.రామకృష్ణా రెడ్డి, ప్రిన్సిపాల్ లక్ష్మి పాల్గొన్నారు.

62వ వార్డులో..

సింధియా: జీవీఎంసీ 62వ వార్డు త్రినాథపురం, ప్రకాష్‌నగర్ తదితర ప్రాంతాల్లో సోమవారం నిర్వహించిన కృష్ణాష్టమి వేడుకల్లో వార్డు కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.



కొత్తపాలెం ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో చిన్ని కృష్ణుల సందడి



వెంకటాపురంలో వేణుగోపాలస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న బెహరా భాస్కరరావు



శ్రీకృష్ణుడి విగ్రహం వద్ద పూజలు చేస్తున్న వార్డు కార్పొరేటర్ లక్ష్మణరావు

రద్దీ ప్రాంతాల్లో అప్రమత్తత అవసరం

ఆలయాల వద్ద క్రైం పోలీసుల అవగాహన



వెంకటాపురంలో కృష్ణాలయం వద్ద అవగాహన కల్పిస్తున్న క్రైం ఏఎస్‌ఐ గోవిందమ్మ

గోపాలపట్నం: ఆలయాలు తదితర రద్దీ ప్రాంతాల్లో చోరీలు జరిగే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని గోపాలపట్నం క్రైం పోలీసులు మహిళలకు అవగాహన కల్పించారు. గోపాలపట్నం, కొత్తపాలెం ప్రాంతాల్లోని పలు ఆలయాల్లో సోమవారం క్రైమ్ ఎవేర్‌నెస్ కార్యక్రమం నిర్వహించారు. వెస్ట్ సబ్ డివిజన్ సీఐ నిమ్మకాయల శ్రీనివాసరావు ఆదేశాల మేరకు ఏఎస్‌ఐ గోవిందమ్మ, హెచ్‌సీ మోహన్‌తో కలసి భక్తులకు అవగాహన కల్పించారు. రద్దీగా ఉన్న సమయంలో చోరీలకు ఆస్కారం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని సూచించారు. విలువైన ఆభరణాలు ధరించి, ఒంటరిగా వెళ్లవద్దని చెప్పారు.

భూ బాధితుల సదస్సు గోడ ప్రతిక ఆవిష్కరణ



గోడ పత్రిక ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

సింధియా: జీవీఎంసీ 63వ వార్డు జయేంద్రకాలనీ కూడలిలోని భగత్‌సింగ్ జంక్షన్ వద్ద ఈ నెల 28న విజయవాడలో జరిగే భూ బాధితుల సదస్సుకు సంబంధించిన గోడ ప్రతికను సీపీఐ జిల్లా కార్యదర్శి కాండ్రేగుల సత్యాంజనేయ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూబకాసురల చేతిలో ఉన్న ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకోవాలని కోరారు. ఎన్నో సంవత్సరాలుగా నివాసాలు ఏర్పాటు చేసుకుని జీవిస్తున్న వారందరికీ ఇళ్ల పట్టాలు ఇచ్చి, పక్కా గృహాలు మంజూరు చేయాలనే డిమాండ్‌తో సదస్సు నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు గుడాల రాంబాబు, కాకరలోవ శాఖ కార్యదర్శి ఎన్వీ త్రినాథ్, మల్కాపురం శాఖ కార్యదర్శి శ్రీనివాస్, కాసా వెంకటరమణ, వెంకట్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

అంగన్‌వాడీ కేంద్రానికి సామగ్రి వితరణ



అంగన్‌వాడీకి సామగ్రి అందిస్తున్న కార్పొరేటర్ పి.వి.సురేష్, రేవళ్ల సత్యనారాయణ

మల్కాపురం: జీవీఎంసీ 59వ వార్డు హనుమాన్‌నగర్ వద్ద మదర్ థెరిసా జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు.వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు రేవళ్ల సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అమ్మా నాన్న ట్రస్టు వార్షికోత్సవంలో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో 60వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ పి.వి.సురేష్ పాల్గొని మదర్ థెరిసా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమె చేసిన సేవలను వివరించారు. ఈ సందర్భంగా అమ్మా నాన్న ట్రస్టు ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రంతో పాటు పాఠశాలకు అవసరమైన సామగ్రిని కార్పొరేటర్ పి.వి.సురేష్, ట్రస్టు నిర్వాహకుడు రేవళ్ల సత్యనారాయణ అందించారు.

కొత్త కమిటీ ఏర్పాటు చేస్తాం



కార్యక్రమంలో మాట్లాడుతున్న పుర్రె సురేష్‌యాదవ్

మల్కాపురం: జీవీఎంసీ 59వ వార్డులోని శ్రీ కృష్ణ కల్యాణ మండపంలో సోమవారం పారిశ్రామిక ప్రాంత యాదవుల ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. యాదవ సంఘం ప్రతినిధి పుర్రె సురేష్ యాదవ్ మాట్లాడుతూ పారిశ్రామిక ప్రాంతంలో యాదవుల ఐక్యతకు నిదర్శనం ఇక్కడ ఏర్పాటు చేసిన కల్యాణ మండపం అన్నారు. కల్యాణ మండపానికి వచ్చే వారంలో కొత్త కమిటీ ఏర్పాటు చేస్తామన్నారు. జిల్లా యాదవ సంఘం ప్రతినిధి పుర్రె అప్పారావుయాదవ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో టీఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నక్క లక్ష్మణరావుయాదవ్,తోనంగి వెంకటరమణియాదవ్, శ్రీలక్ష్మియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సినీ సంగీత విభావరి



కార్యక్రమంలో మాట్లాడుతున్న గాయకుడు సత్యనారాయణ

మల్కాపురం: స్థానిక వైష్ణవి ఫంక్షన్ హాల్‌లో సోమవారం జ్యోతి స్వరాగాల సీజన్ -1 కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. కార్యక్రమంలో ప్రముఖ గాయకుడు,మన్యం ధీరుడు సినీ నిర్మాత,హీరో అయిన ఆర్.వి.వి.సత్యనారాయణ మాట్లాడుతూ ఇంత మంది గాయినీ, గాయకులు ఒకే వేదికపై గేయాలు ఆలపించడం ఆనందంగా ఉందన్నారు. కష్టపడితే తప్పక అభిమానుల నుంచి గుర్తింపు వస్తుందన్నారు. అల్లూరి సీతారామరాజు నాడు చేసిన పోరాటాలపై మన్యం ధీరుడు అనే సినిమా తీశానని, త్వరలో దేశ వ్యాప్తంగా విడుదల చేయనున్నట్టు వివరించారు.ఈ సినిమాను అంతా ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో గాజువాక మూవీ ఆర్టిస్టుల అసోసియేషన్ ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.

ఏయూ హాస్టళ్లు, మెస్‌ల తనిఖీ

విశాఖ సిటీ: ఆంధ్ర విశ్వవిద్యాలయం హాస్టళ్లు, మెస్‌లను సోమవారం ఏయూ అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. రెక్టార్ ఆచార్య ఎన్.కిషోర్‌బాబు, ప్రిన్సిపాల్స్ ఆచార్య ఎ.నరసింహారావు, ఎం.వి.ఆర్.రాజు, చీఫ్ వార్డెన్‌లు ఆచార్య ఎస్.హరనాథ్, ఆచార్య కె.రమేష్‌బాబు ముందుగా మెస్‌లలో భోజన నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులకు అందించే టిఫిన్‌ను స్వయంగా రుచిచూశారు. విద్యార్థులకు రుచికరమైన ఆహారాన్ని అందించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం విద్యార్థుల హాస్టళ్ల తనిఖీ చేశారు. వారికి వసతి కల్పిస్తున్న విధానాన్ని ప్రత్యక్షంగా గమనించారు.

మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలి

సీఐ చక్రధరరావు



పాల్గొన్న స్థానిక యువకులు



దుర్గాపురంలో నిర్వహించిన సదస్సులో మాట్లాడుతున్న సీఐ చక్రధరరావు

గోపాలపట్నం: యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఎయిర్ పోర్టుజోన్ సీఐ చక్రధరరావు అన్నారు. జీవీఎంసీ 57వ వార్డు దుర్గాపురంలో సోమవారం మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత మాదక ద్రవ్యాలకు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. అంతేకాకుండా నేరాలకు పాల్పడి ఉజ్వల భవితకు ముగింపు పలుకుతున్నారని వివరించారు. విద్యార్థి దశలోనే ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు, సైబర్ నేరాలు, మహిళలపై జరుగుతున్న నేరాలకు ప్రధాన కారణం గంజాయి, మద్యపానం, డ్రగ్స్ వంటివేనని అన్నారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సెల్‌ఫోన్‌కు తెలియని నంబర్ల నుంచి వచ్చే మెసేజ్‌లు లింకులు ఓపెన్ చేయవద్దని సూచించారు. లాటరీ వచ్చిందని, ఉద్యోగాల పేరిట, వచ్చే కాల్స్‌ను నమ్మవద్దని తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలు పటించాలని సూచించారు. వాహం నడిపేవారు విధిగా హెల్మెట్ వాడాలన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని సూచించారు. మాదక ద్రవ్యాలకు అలవాటుపడిన వారికి అవసరమైన చికిత్స, కౌన్సెలింగ్ అందిస్తారని తెలిపారు. ప్రమాదకర పరిస్థితులు ఎదురైనపుడు 100, 112, 1930 నంబర్లకు సమాచారమివ్వాలని సూచించారు. దుర్గాపురం గ్రామ కమిటీ అధ్యక్షుడు చందాపు గుణ్ణేశ్వరరావు ఆధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గ్రామ పెద్దలు దమ్మ గోవిందు, వెంకటరమణ, మధు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వర్షాలకు కూలిన గోడ



కొత్తపాలెంలో కూలిన ప్రహరీ

గోపాలపట్నం: కొత్తపాలెంలో ఒక ఇంటి ప్రహరీ కూలింది. సోమవారం ఉదయం కురిసిన వర్షానికి కొత్తపాలెంలో నివాసముంటున్న బి. రామానందం ఇంటి ప్రహరీ కూలి పోయింది. అయితే ఈ ప్రమాదంలో ఎవరికీ నష్టం జరగలేదు. కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు నేల బాగా నాని పోవడంతో గోడ కూలిపోయిందని స్థానికులు చెబుతున్నారు. జన సంచారం లేకపోవడంతో ఎవరికి ఏ ప్రమాదం చోటు చేసుకోలేదు.

ఎరుసలేం చర్చిలో ఘనంగా 40 ఏళ్ల పండగ



విజేతలకు కప్ అందిస్తున్న ఎమ్మెల్యే గణబాబు

గోపాలపట్నం: జీవీఎంసీ 91వ వార్డు జయప్రకాష్‌నగర్‌లోని ఎరుసలేం ప్రార్థన మందిరంలో 40 ఏళ్ల పండగను (రుబీ జూబ్లీ) సోమవారం ఘనంగా నిర్వహించారు. సంఘకాపరి సిస్టర్ ఈస్ ఏంజెల్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సంఘ సభ్యులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. ఎమ్మెల్యే గణబాబు హాజరై క్విజ్ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. యూత్ సభ్యులు పలు ప్రదర్శనలు పాటలు పాడి అలరించారు.

మేడపై నుంచి పడి యువకుడి మృతి



రామ్‌దిన్ ఫైన్‌కార్ మృతదేహం

పెదగంట్యాడ: మేడపై నుంచి పడి ఓ యువకుడు మృతి చెందాడు. న్యూపోర్టు పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం, జాస్‌పూర్ జిల్లా, బేంగూ గ్రామానికి చెందిన రామ్‌దాస్ ఫైన్‌కార్ (25) తన సోదరుడు అలికేస్వాన్ ఫైన్‌కార్‌తో కలసి మండలంలోని గొడ్డువానిపాలెంలో ఓ ఇంట్లో నివాసం ఉంటున్నారు. వీరిద్దరూ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. రోజూ మాదిరిగానే ఆదివారం విశాఖపట్నం పోర్టులో పని చేసుకుని రాత్రి 9.30 గంటల సమయంలో ఇంటికి చేరుకున్నారు. తర్వాత వారిద్దరూ మిత్రులతో కలసి మద్యం సేవించారు. ఆ తర్వాత వారంతా ఆ ఇంటి మేడమీద నిద్రకు ఉపక్రమించారు. అర్ధరాత్రి సమయంలో ఒక్కసారిగా వర్షం పడడంతో అలికేస్వాన్ ఫైన్‌కార్‌తో అక్కడ పడుకున్న వారిని నిద్రలేపి కిందకు వెళ్లిపోయాడు. రామ్‌దాస్ ఫైన్‌కార్ మాత్రం మేడపైనే ఉండి పోయాడు. సోమవారం ఉదయం 6.30 గంటల సమయంలో మేడపైకి వెళ్లి చూడగా రామ్‌దాస్ పక్కనున్న మేడపై పడి మృతి చెంది ఉన్నాడు. దీంతో వెంటనే న్యూపోర్టు పోలీసులకు సమాచారం అందించారు. స్పందించిన పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. అలికేస్వాన్ ఫైన్‌కార్ ఫిర్యాదు మేరకు న్యూపోర్టు సీఐ దాలిబాబు ఆధ్వర్యంలో ఎస్‌ఐ శ్రీనివాస్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

19 కిలోల గంజాయి స్వాధీనం

తాటిచెట్లపాలెం : అక్రమంగా గంజాయి తరలిస్తున్న ఇద్దరిని విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో రైల్వే పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 19 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. గవర్నమెంట్ రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో రైల్వే భద్రతా దళం సబ్ ఇన్‌స్పెక్టర్ వి.కీర్తిరెడ్డి సిబ్బందితో సోమవారం తనిఖీలు చేశారు. ఆ సమయంలో ఢిల్లీకి చెందిన షాకిబ్ అలీ, ముంబయికి చెందిన శంకర్ తెవతియా బిశ్వాల్ వద్ద గంజాయి గుర్తించారు. వారు విశాఖపట్నం రైల్వే స్టేషన్ మీదుగా ఢిల్లీ, ముంబయికి గంజాయి తరలిస్తున్నట్లు గుర్తించారు. వారిని అదుపులోకి తీసుకుని 19 కేజీల గంజాయి స్వాధీనం చేసుకుని జీఆర్పీ ఎస్‌ఐ ఎస్.రామారావుకు అప్పగించారు. వీరిని కోర్టులో హాజరుపరిచినట్లు సిబ్బంది తెలిపారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



స్పోర్ట్స్ మీట్‌లో షటిల్ ఆడుతున్న వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్

విశాఖ సిటీ: క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని వీఎంఆర్‌డీఏ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ పేర్కొన్నారు. వీఎంఆర్‌డీఏ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఆంధ్ర విశ్వకళా పరిషత్ జిమ్నాజియం ఇండోర్ స్టేడియంలో ఉద్యోగులకు నిర్వహించిన స్పోర్ట్స్ మీట్‌ను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ట్లాడుతూ ఉద్యోగులు మరింత ఉత్సాహంగా విధులు నిర్వహించడానికి ఇటువంటి స్పోర్ట్స్ మీట్‌లు ఎంతో దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి దాట్ల కీర్తి, సంయుక్త కమిషనర్ రవీంద్ర, ముఖ్య గణాంకాధికారి హరిప్రసాద్, డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్ శాంతి స్వరూప్, ప్రధాన ఇంజినీర్ భవానీశంకర్, వీకేసీపీఐఆర్ జాయింట్ డైరెక్టర్ శిల్ప, కార్యనిర్వహక ఇంజినీర్లు రామరాజు, రాంబాబు, ఉద్యోగులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి కల్పించాలి



ర్యాలీలో ఏఐటీయూసీ నాయకులు

సీతమ్మధార : ఇసుక, సిమెంట్, ఐరన్ ధరలు తగ్గించి భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి కల్పించాలని ఏఐటీయూసీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యుడు జి.వామనమూర్తి డిమాండ్ చేశారు. భవన నిర్మాణ సామగ్రి ధరలు తగ్గించాలని, సెప్టెంబర్ 3న విశాఖలో నిర్వహించే కార్మిక ప్రదర్శన, బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరుతూ సోమవారం సీతమ్మధార అల్లూరి సీతారామరాజు జంక్షన్ వద్ద ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వాలు కార్మికులకు రోజుల తరబడి ఉపాధి లేకుండా చేస్తున్నాయని మండిపడ్డారు. పెంచిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు, నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు.

విశాఖ ఉక్కు.. ఆంధ్రుల సొత్తు



దీక్షా శిబిరంలో పాల్గొన్న ఇంటక్ నాయకులు, పోరాట కమిటీ నాయకులు

అగనంపూడి: విశాఖ ఉక్కు ఆంధ్రుల సొత్తు అని విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ నాయకులు మంత్రి రాజశేఖర్, డి.ఆదినారాయణ అన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిరసిస్తూ కూర్మన్నపాలెం కూడలిలో ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీల ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షా శిబిరంలో వారు మాట్లాడారు. రాష్ట్ర ప్రజ లు ప్రాణాలు, భూములు త్యాగం చేస్తే ఏర్పా టు చేసిన విశాఖ స్టీల్‌ప్లాంట్‌పై కేంద్ర ప్రభు త్వం తన ఇష్టమొచ్చినట్టు పెత్తనం చెలాయిస్తే రాష్ట్ర ప్రజలు చూస్తూ ఊరుకోరన్నారు. సమయం వచ్చినప్పుడు విప్లవంలా తిరుగుబాటు తప్పదన్నారు. కేంద్రం తన వైఖరి మార్చుకొని ప్రభుత్వరంగ సంస్థగా కొనసాగించాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో నాయకులు నీరుకొండ రామచంద్రరావు, సుబ్బయ్య, వరసాల శ్రీనివాసరావు, పి.వి.రమణమూర్తి, ఎస్.వై. నాయుడు, దేముడు, కారు రమణ, మంత్రి నారాయణ, గోపాలరాజు, గంగవరం గోపి, కొమ్ము ప్రసాద్ పాల్గొన్నారు.

